క్లుప్తంగా

పరామర్శ



శేషారెడ్డిని పరామర్శిస్తున్న కిలివేటి

నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం అగ్రహారపేటలో ఉంటున్న డీలర్ శేషారెడ్డిని పరామర్శించారు. ఆయన అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సంజీవయ్యతోపాటు వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు.

పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్చాలి



అవగాహన కల్పిస్తున్న కో–ఆర్డినేటర్

పెళ్లకూరు: ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్చాలని సహిత జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దిగువ చావలిలో ప్రత్యేక సర్వే నిర్వహించి ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి, పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయురాలు వనిత పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఆటిజం (ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం) భవన నిర్మాణం కోసం మంగళవారం జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అనువైన స్థలం ఎంపిక చేసినట్టు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక భవిత కేంద్ర సహిత ఉపాధ్యాయులు జి.నేతాజి, సుబ్రహ్మణ్యం, హేమలత పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

దక్కిలి: రేషన్ దుకాణ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం రేషన్ దుకాణ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసి స్టాక్ వివరాలు బోర్డులో నమోదు చేయాలని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా ఇవ్వాలి



మాట్లాడుతున్న తహసీల్దార్, డీటీ

నాయుడుపేటటౌన్: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర, సివిల్ సప్లైయీస్ డీటీ పెళ్లూరు గోపినాథ్‌రెడ్డి డీలర్లకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న తహసీల్దార్

వాకాడు: మండలంలోని నిడిగుర్తి పంచాయతీలో కొన్ని రోజులుగా నెలకుని ఉన్న తాగునీటి సమస్యను మంగళవారం అధికారులు పరిష్కరించారు. గత మూడు నెలలుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్న తీర ప్రాంత గ్రామాల ప్రజలు అధికారులకు మొరపెట్టుకోవడంతో తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు స్పందించి ఆదేశాలు ఇవ్వడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి రెండు రోజులుగా తాగునీటి సరఫరాకు కావాల్సిన మరమ్మతు పనులు నిర్వహించి తాగునీరు అందించారు. తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు తాగునీటి సరఫరాను ప్రారంభించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు మంచి చేస్తున్నామని ప్రకటించి మినీ గోకులాల పథకాన్ని తీసుకొచ్చింది. ఉపాధి హామీ నిధులతో షెడ్లు నిర్మించేలా ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి నేతల ఒత్తిళ్లతో పాడి రైతులు షెడ్లు నిర్మించుకున్నారు. వారికి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. అప్పులు చేసి షెడ్లు నిర్మించుకున్నామని, అసలు బిల్లులు వస్తాయో, రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



తిన్నెలపూడిలో మినీ గోకులం పశువుల షెడ్డు



కోటలో మినీ గోకులం పశువుల షెడ్డు

గోకులాల బిల్లులు ఎప్పుడో..?

- నెలలు గడుస్తున్నా రూపాయి విదల్చని కూటమి ప్రభుత్వం
- అప్పు చేసి షెడ్లు నిర్మించుకున్నట్టు రైతుల ఆవేదన

కోట/ఓజిలి: గూడూరు నియోజకవర్గానికి 205 మినీ గోకులాలు మంజూరయ్యాయి. అదేవిధంగా ఓజిలి మండలంలో ఈ ఏడాది టీడీపీ ప్రభుత్వంలో 14 గోకులాలు మంజూరు చేసింది. షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు తప్పనిసరి చేశారు. ఆరు పశువులు ఉండే షెడ్లకు రూ.2.30 లక్షలు, నాలుగు పశువులు ఉన్న షెడ్లకు రూ.1.85 లక్షలు, రెండు పశువులు ఉన్న షెడ్లకు రూ.1.15 లక్షలు, 50 గొర్రెలు ఉన్న షెడ్లకు రూ.2.30 లక్షలు, 20 గొర్రెలు ఉంటే రూ.1.30 లక్షలు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. పశువుల షెడ్లకు 90 శాతం, మేకలు, గొర్రెల షెడ్లకు 70 శాతం రాయితీ ప్రకటించారు. షెడ్ల నిర్మాణం పూర్తయిన తరువాత ఉపాధి హామీ నిధుల నుంచి లబ్ధిదారుల



లక్ష్మక్కకండ్రిగలో పిల్లర్ల దశలోనే ఆగిన మినీగోకులం షెడ్డు

ఖాతాకు రాయితీని బదిలీ చేస్తారు. ఓజిలి మండలం అత్తివరం, గ్రద్దగుంట, సగుటూరు, మానమాల, ఓజిలి, కురుగొండ, కొత్తచెరువు, పెదపరియ, భట్లకనుపూరు, పున్నేపల్లి, కర్రబల్లవోలు మనవాలి గ్రామాల్లో పాడి రైతులు గోకులాలను నిర్మించుకున్నారు. వాటిని డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ పరిశీలించారు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి షెడ్లు నిర్మించుకున్నామని, వడ్డీలు పెరిగిపోయి అప్పుల్లో కూరుకుపోతున్నామని వాపోతున్నారు. తమ ఒత్తిడితోనే పనులు చేపట్టామని, బిల్లులు మంజూరు చేసేలా చూడాలని నిలదీస్తుండడంతో కూటమి నేతలు తలలు పట్టుకుంటున్నారు.

గూడూరు నియోజకవర్గంలో మంజూరైన మినీ గోకులాలు

గూడూరు	:	24
చిల్లకూరు	:	25
కోట	:	58
వాకాడు	:	75
చిట్టమూరు	:	23

వెంటనే బిల్లులు ఇవ్వాలి



పశువుల కోసం షెడ్డు నిర్మించుకుంటే వెంటనే డబ్బులు ఇస్తామన్నారు. అధికారులు చెప్పినట్లే కొలతల ప్రకారం షెడ్డు కట్టాం. నీటి తొట్టిలు కూడా నిర్మించుకున్నాం. షెడ్డు నిర్మాణం పూర్తయినా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బిల్లు ఇవ్వలేదు.

– మస్తానయ్య, తిన్నెలపూడి, కోట

నిర్మాణం ఆపేశాం



పశువుల కోసం షెడ్డు కట్టమని అధికారులు చెప్పారు. మొదటి విడతగా కొంత మొత్తం బిల్లులు ఇస్తామని చెప్పారు. పిల్లర్లు వేసి బిల్లు ఇవ్వాలని అడిగితే పట్టించుకోలేదు. సొంత డబ్బులతో కట్టుకునే స్థోమత లేక పిల్లర్ల దశలోనే నిలిపివేశాం.

– రమణమ్మ, లక్ష్మక్కకండ్రిగ, కోట

రైతులను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు పంపించాం

ఉపాధి హామీ పథకం కింద రైతులు నిర్మించుకున్న మినీ గోకులాలకు నిధులు ఇవ్వాలి. రైతులను ఎంపిక చేసి వారి దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు విడుదలకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– డాక్టర్ సుబ్రమణ్యం, పశుసంవర్ధకశాఖ ఏడీ, కోట

బిల్లులు ఆన్‌లైన్ చేశాం



గోకులాల నిర్మాణాలు పూర్తయిన వారికి రూ.1.45 లక్షల నగదును ఆన్‌లైన్ చేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ అవుతుంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– చిన్నయ్య, ఏపీఓ, ఓజిలి మండలం

ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

వెంకటగిరి రూరల్: మున్సిపాలిటీలో దుకాణదారులు ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులతో ప్లాస్టిక్ నిషేధం దిశగా తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ ఉన్న దుకాణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పరిమళ

దక్కిలి: మహిళలు, గర్భవతులు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ తెలిపారు. కందలవారిపల్లెలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 41.388 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 41.388 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,880, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

30న యోగాపై శిక్షణ

కలువాయి(సైదాపురం): యోగా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో యోగాంధ్ర నిర్వహించేందుకు టీటీటీలకు ఈనెల 30న శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ భవాని తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎంపీడీఓ, వెలుగు కార్యాలయాలు, కలువాయి సచివాలయం–1లో మూడు బృందాలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో క్లస్టర్–1 ద్వారా తెలుగురాయపురం, తోపుగుంట, చీపినాపి, కేశమనేనిపల్లి, కనుపూరుపల్లి, వెలుగు కార్యాలయంలో క్లస్టర్–2 ఉయ్యాలపల్లి, మాదనగారిపల్లి, కుల్లూరు–1, కుల్లూరు–2, బద్దెవోలు గ్రామ సచివాలయం, క్లస్టర్–3 ద్వారా కలువాయి గ్రామ సచివాలయం వద్ద కలువాయి–1, కలువాయి–2, కలువాయి–3, చిన్నగోపవరం, దాచూరు గ్రామ సచివాలయాలకు ఎంటీటీల ద్వారా టీటీటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు.

కోట పోలీస్‌స్టేషన్ తనిఖీ

కోట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ గీతాకుమారి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కొన్ని కేసులకు సంబంధించి విచారణపై వివరాలు సేకరించారు. డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామన్నారు. నిఘాను పటిష్ఠ పరిచి నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ఆమె వెంట ఎస్‌ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

కాకాణి అరెస్ట్ అప్రజాస్వామికం



మెట్టా రాధాక్రిష్ణారెడ్డి

గూడూరురూరల్: మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టా రాధాక్రిష్ణారెడ్డి అన్నారు. తిప్పవరప్పాడులోని ఆయన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తమకు అడ్డుగా ఉన్న ప్రతిఒక్కరిపై అక్రమంగా కేసులు నమోదు చేస్తోందన్నారు. మైనింగ్‌లో ఎటువంటి అవకతవకలు జరగలేదని చెప్పిన అధికారులపై ఒత్తిడి తెచ్చి కాకాణిపై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. అదే విధంగా ప్రజల హక్కులను హరించేలా పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వం అధికారం చేతిలో ఉందని అక్రమ అరెస్టులకు పూనుకోవడం సహించరానిదని గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి దుయ్యబట్టారు. ఎంపీపీ చాంబర్‌లో మంగళవారం వారు మాట్లాడారు. న్యాయ వ్యవస్థపై తమ పార్టీకి నమ్మకం ఉందని న్యాయస్థానంలోనే న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

కాకాణి అరెస్ట్ అన్యాయం

ఓజిలి: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ అన్యాయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి అన్నారు. ఓజిలిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనింగ్‌లో కాకాణికి ఎటువంటి సంబంధం లేకపోయినా ఎవరో ఇచ్చిన అబద్ధపు వివరాల మేరకు ఆయన్ను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ మంత్రులు, ప్రజాప్రతినిధులపై కక్షకట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతలు చేస్తున్న అక్రమాలు, అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలు గమనిస్తున్నారని, వారికి త్వరలోనే బుద్ధిచెప్తారని అన్నారు. అక్రమ కేసులు, అరెస్టులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడరని చెప్పారు.

వరి గంగ పాలు

–బోరుమంటున్న రైతులు

పెళ్లకూరు: తెలుగుగంగ జలాలు స్థాయికి మించి చెరువుకు సరఫరా కావడంతో వరి పైర్లు నీట మునిగిపోవడంతో పలువురు రైతులు గుండెలు బాదుకుంటున్నారు. బంగారంపేట గ్రామానికి చెందిన పలువురు రైతులు 170 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. అయితే గ్రామంలో ఉన్న చెరువు ఇటు బంగారంపేటకు అటు దొరవారిసత్రం మండలంలోని వేణుంబాక గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులకు సంబంధించినది. అయితే తెలుగుగంగ జలాలు పుష్కలంగా సరఫరా కావడంతో వేణుంబాక రైతులు సామర్థ్యానికి మించి చెరువుకు నింపుకున్నారు. దీంతో వంద ఎకరాలకు పైగా బంగారంపేటకు చెందిన వరి పైర్లు నీటమునిపోయాయి. దీంతో అన్నదాతలు దిక్కుతోచక అల్లాడుతున్నారు. ఇప్పటికే గంగ జలాలు వరి పైర్లను చుట్టేయడంతో నీట మునిగి పైర్లు కుళ్లిపోయాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



తెలుగుగంగ జలాలతో నీట మునిగి దెబ్బతిన్న వరి

యోగాతోనే ఆరోగ్యం

ఓజిలి: ఓజిలి, అత్తివరం గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ విజయలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వీరు యోగా ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈఓపీఆర్డీ రేణుక, ఏపీఎం పద్మమ్మ, సర్పంచ్ రమణయ్య, ట్రైనర్ హరిబాబు, ఆయూష్ వైద్యురాలు మంజుల పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: మండలంలోని కల్లూరు, మీజూరు, పూలతోట గ్రామ సచివాలయాల్లో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగాపై సచివాలయం సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ గోవర్ధన్, ఏపీఓ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: మండలంలో యోగాంధ్ర శిక్షణ తరగతులను ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ మంగళవారం ప్రారంభించారు. అరవపాళెం, మల్లాం, మొలకలపూడి, గునపాడు క్లస్టర్లలో మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ శంకర్, ఆనంద్, చైతన్య కుమార్, ఎల్లయ్య యోగాపై శిక్షణ ఇచ్చారు.



పెళ్లకూరులో యోగాసనాలు వేస్తున్న మహిళలు

శిక్షణ కేంద్రాలను ఎంపీడీఓ పరిశీలించారు.

పెళ్లకూరులో

పెళ్లకూరు: స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, పలువురు తల్లిదండ్రులకు యోగా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంఈఓ శంకరయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పురపాలక సంఘంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని బాపూజీకాలనీ, గాండ్ల వీధి సచివాలయాల్లో మాస్టర్ ట్రైనర్లు యోగాపై అవగాహన కల్పించి శిక్షణనిచ్చారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, పురపాలక, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: స్థానిక అంబేడ్కర్ భవన్, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో యోగాంధ్రను మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా ప్రారంభించారు. మేనకూరులో వైఎ



వాకాడులో..

స్వార్‌పార్కు వద్ద, పుదూరు, అన్నమేడు, కాపులూరులలో సచివాలయల వద్ద ఎంపీడీఓ సురేష్‌బాబు ప్రారంభించారు.

వాకాడులో..

వాకాడు: స్త్రీశక్తి భవనంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు ప్రారంభించారు. అనుభవజ్ఞులైన వారిచే యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.

రాపూరులో..

రాపూరు: స్థానిక సచివాలయంలో ఉద్యోగులకు యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ భవాని పాల్గొన్నారు.



అత్తివరంలో యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ



కల్లూరు సచివాలయంలో అవగాహన



మల్లాంలో ఉద్యోగుల యోగాసనాలు



పెళ్లకూరులో యోగాపై అవగాహన



పుదూరులో..



రాపూరులో యోగాసనాలు

సిలికా తవ్వకాలపై ఆందోళన



సిలికాను తరలించేందుకు వచ్చిన టిప్పర్లు

వాకాడు: మండలంలోని కొండూరు గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం కొందరు సిలికా తవ్వకాలు చేపట్టారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో టిప్పర్లు అక్కడకు చేరుకోవడంతో సిలికా తవ్వకాలు ఆపాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ విషయమై మైన్స్ ఏడీ కె. శ్రీనివాసరావును వివరణ కోరగా ఎస్‌పీఎస్‌వీ ఫారమ్స్ వారికి 2023 సంవత్సరం నుంచి 2043 వరకు అనుమతులు వచ్చాయన్నారు. అలాగే వాకాడు తహసీల్దార్ రామయ్యను వివరణ కోరగా 38, 40 సర్వే నంబర్‌లో 31 ఎకరాల్లో సిలికాను తీసుకునేందుకు 20 సంవత్సరాల వరకు అనుమతులు ఉన్నాయన్నారు.

గూడూరులో సహిత విద్యా కేంద్రం



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

చిల్లకూరు: ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం సహిత విద్యా కేంద్రాన్ని గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు విషయంపై జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం హెచ్‌ఎంతో చర్చించి స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. హెచ్‌ఎం మాధవిలక్ష్మి, ఐఈఆర్‌పీలు నేతాజి, హేమలత, అజయ్‌బాబు, మంగమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.